

నేటి నుంచి బీచ్‌లోకి నో ఎంట్రీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంసౌత్, కెపి పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్‌లోకి ఈ నెల 26వ తేదీ నుండి 28వ తేదీ వరకూ పర్యాటకులెవ్వరినీ అనుమతించడం లేదని ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో అలల ఉధ్రుతి పెరిగే ప్రమాదం ఉన్నందున బీచ్‌లో స్నానాలకు అనుమతించడం లేదని ఆయన చెప్పారు. పర్యాటకులు, ప్రజలు తమకు సహకరించాలని కోరారు.



ఎగసి పడుతున్న అలలు

అద్దె భవనాల్లో అగచాట్లు

- హాస్టళ్లకు సొంత గూడు కరువు
- ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు
- సొంత భవనాల నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

జిల్లాలో సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు కరువయ్యాయి. సగానికిపైగా వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇరుకుగదుల్లో నానావస్థలు పడుతున్నారు. ఒకపక్క సొంత భవనాలు లేక, మరోపక్క కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అయితే సంక్షేమ వసతి గృహాలకు సొంత గూడు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలను సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. పరిసరాల్లో పారిశుధ్య లేమి, సరిగా లేని మరుగుదొడ్లు, తాగునీటి కొరత, దోమల బెడద, నాణ్యత లేని ఆహారం, విరిగిన బల్లలు, మంచాలు, బెడ్స్ లేక కటిక నేలపైనే నిద్ర వంటి అనేక కష్టాలు విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ పరిధిలో 16 బోయ్స్, 13 గర్ల్స్ హాస్టళ్లు ఉన్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 15 బోయ్స్, 20 గర్ల్స్ హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 64 హాస్టళ్లకుగాను 32 హాస్టళ్లకు సొంత భవనాలు ఉండగా, మిగిలిన 32 భవనాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. తాడేపల్లిగూడెం రూరల్ ఆరుగొలను, నరసాపురం రూరల్ ఎల్‌బిచర్లలో గురుకుల కళాశాలలు, పెనుగొండలో గురుకుల బాలికల పాఠశాల, తాడేపల్లిగూడెం రూరల్ తాడేపల్లిలో గురుకుల బాలుర పాఠశాల ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా వసతిగృహాల్లో 5,329 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే అద్దె భవనాలు ఇరుకుగా ఉండడంతో రాత్రి సమయంలో నిద్రపోవడానికి పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఒకే హాల్లో మొత్తం విద్యార్థులు నిద్రపోవాల్సిన దుస్థితి ఉంది. పరీక్షల సమయంలో అయితే విద్యార్థుల పరిస్థితి చెప్పుకోనవసరం లేదు. అంతా కలిసి కంబైన్డ్ స్టడీ చేయడం తప్ప విడిగా ప్రశాంత వాతావరణంలో చదువుకునే వెసులుబాటు ఉండట్లేదని విద్యార్థులు వాపోతున్నారు. చివరకు విద్యార్థులకు అవసరమైన సామగ్రి, విద్య సామగ్రిని భద్రపరుచుకునేందుకు సైతం సరైన వసతి సౌకర్యాలు ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. దీనికి తోడు ప్రయివేటు భవనాల యజమానులు రకరకాల షరతులు విధించడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.



ఇక సొంత భవనాలు ఉన్న హాస్టళ్లలోనూ పలు సమస్యలు తాండవిస్తున్నాయి. ఆ భవనాలు నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. పాలకొల్లు ఆనంద నిలయం ప్రభుత్వ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో అక్కడ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలకు చెందిన బాలికల వసతి గృహనికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వారు వసతి పొందుతున్నారు.

మరమ్మతులతో మమ

జిల్లావ్యాప్తంగా 64 వసతిగృహాలు ఉన్నాయి. దీనిలో 32 అద్దె భవనాల్లో సాగుతున్నాయి. ఎస్‌సి సంక్షేమ శాఖ పరిధిలో 35 వసతి గృహాలు ఉండగా 24 హాస్టళ్లు ప్రభుత్వ భవనాల్లో, 11 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ భవనాలు అన్నింటికీ మరమ్మతుల నిమిత్తం ఇటీవల రూ.కోటీ 29 వేలు మంజూరయ్యాయి. 80 శాతం మరమ్మతు పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. బిసి సంక్షేమ శాఖ పరిధిలో 29 వసతి గృహాలు ఉండగా, కేవలం ఎనిమిదింటికి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 21 హాస్టళ్లు అద్దె భవనాల్లో ఉన్నాయి. ఇటీవల రూ.7 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేశారు. అయితే సొంత భవనాలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోగా, ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరినా మరమ్మతులు చేసి మమ అనిపిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతినెలా లక్షలాది రూపాయల అద్దె చెల్లింపు

జిల్లాలో 32 ప్రభుత్వ వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ప్రతి నెలా రూ.లక్షల్లో ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. పట్టణాల్లో స్క్వేర్ సెంటీమీటర్‌కు రూ.7, గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.5 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఉదాహరణకు జిల్లా కేంద్రమైన భీమవరంలో రెండు అంతస్తులు కలిగిన వసతిగృహానికి ప్రతినెలా రూ.50 వేలు చెల్లిస్తున్నారు. అదే గ్రామీణ ప్రాంతాలైతే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లిస్తున్నారు.



భీమవరంలో ప్రయివేటు భవనంలో నడుస్తున్న హాస్టల్

ప్రభుత్వం రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తుంది తప్ప విద్యార్థులకు సౌకర్యవంతంగా సొంత భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.3 కోట్లతో వసతిగృహం నిర్మాణానికి ప్రతిపాదన

ఎన్‌వి.అరుణకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి



పాలకొల్లులోని ఆనంద నిలయం వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడి విద్యార్థులను పక్కనే ఉన్న కళాశాలకు చెందిన బాలికల వసతి గృహానికి తరలించి వసతి అందిస్తున్నాం. పాలకొల్లు ప్రాంతంలో రూ.3 కోట్లతో అత్యాధునిక భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు చేపడతారు. ఇటీవల రూ.కోటీ 29 లక్షలతో 35 వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టాం. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తి చేశాం.

రూ. కోటితో మరమ్మత్తులకు ప్రతిపాదన

ఎవి.సూరిబాబు, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి



బిసి సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. ఇటీవల కలెక్టర్ చదలవాడ నాగరాణి సమక్షంలో నిర్వహించిన సమావేశంలో వసతిగృహాల పరిస్థితిపై నివేదిక అందించాం. కలెక్టర్ ఆదేశాలతో రూ.కోటితో వసతిగృహాల మరమ్మతుకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులు చేపడతాం. జిల్లాలో అన్ని వసతిగృహాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

మళ్లీ తుపాన్ ముప్పు

- రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు
- జిల్లా అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు
- కలెక్టరేట్, ఆర్‌డిఒ కార్యాలయాల్లో కంట్రోల్ రూముల ఏర్పాటు
- కలెక్టర్ చదలవాడ నాగరాణి



సమీక్షిస్తున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాపై మొంథా తుపాన్ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని, రానున్న నాలుగు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి మంతా తుపాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులతో గూగుల్ మీట్ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ నెల 26 నుండి 29 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురియనున్న దృష్ట్యా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ తుపాన్ 28వ తేదీ సాయంత్రం కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. దీని ప్రభావంతో గంటకు సుమారు 90 నుండి వంద కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయన్నారు. జిల్లాలో ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం తుపాన్ తీరం దాటే వరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు డాక్టర్లు సెలవులు రద్దు చేసుకుని విధులకు హాజరు కావాలన్నారు. నెలలు నిండిన గర్భిణులను, వృద్ధులను గుర్తించి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాల వద్ద అత్యవసర మందులు, సిబ్బందిని ఉంచాలన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో రాబోయే వారం రోజులకు సరిపడా నిత్యావసర సరుకులను సిద్ధం చేసి ఉంచాలన్నారు. తుపాను కారణంగా మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే వేటకు వెళ్లిన మత్స్యకారులను తిరిగి ఒడ్డుకు రప్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జిల్లాలో సబ్‌స్టేషన్ల వద్ద ముందస్తుగా జనరేటర్లు, డీజిల్ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అగ్నిమాపక శాఖ బోట్లు, లైఫ్ జాకెట్లు, నిల్వ ఉన్న నీటిని తోడేందుకు మోటార్ ఇంజిన్లను, ట్రీ కటింగ్ మిషన్లను సిద్ధంగా ఉంచాలన్నారు. కలెక్టరేట్‌తోపాటు ఆర్‌డిఒ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మీ, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ బి.శివన్నారాయణరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పి.సూర్యనారాయణ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ జి.గీతాబాయి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి శ్రీనివాసరావు, డిపిఒ ఎం.రామనాథ్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి అధికారి శ్రీనివాసరావు, సిపిఒ కె.శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, ఆర్‌డిఒలు, జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

దేశంలోనే బ్రాకిస్ జిల్లాగా పశ్చిమ

- ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం
- ఉప్పునీటిలో ఆక్వా సాగు చేసేవారికి సిఎఎ రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- యాంటీబయోటిక్ ఫ్రీ ఆక్వా ఉత్పత్తుల సాగుకు కృషి చేయాలి
- కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

దేశంలోనే పశ్చిమగోదావరి జిల్లాను బ్రాకిష్ జిల్లాగా (ఉప్పునీరు) ఆక్వా సాగుకు కేంద్ర ప్రభుత్వం గుర్తించిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఉప్పునీటి (బ్రాకిష్) ఆక్వా సాగుదారులు తప్పనిసరిగా కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ (సిఎఎ) కింద రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఎగుమతులకు ఆటంకం లేని యాంటీ బయోటిక్ ఫ్రీ ఆక్వా ఉత్పత్తుల సాగుకు కృషి చేయాలన్నారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం సిఎఎ రిజిస్ట్రేషన్‌కు చేపట్టాల్సిన చర్యలపై జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ సిఎఎ మార్గదర్శకాల మేరకే బ్రాకిష్ ఆక్వా సాగు నిర్వహించాలని, నిబంధనలను పాటించని వారి సాగుకు గుర్తింపు నమోదు చేయకపోవడంతోపాటు చర్యలుంటాయని హెచ్చరించారు. జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి, భీమవరం రూరల్ మండలాల్లో 17,100 ఎకరాల్లో బ్రాకిష్ ఆక్వా సాగు జరుగుతుందన్నారు. 2005 నుండి 1,880 మంది మాత్రమే సిఎఎ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. ప్రస్తుతం సుమారు వంద మంది మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారని తెలిపారు. బ్రాకిష్ ఆక్వా సాగు సముద్రం హై టైడ్ నుండి 200 మీటర్ల పరిధిలో నిషేధమన్నారు. వ్యవసాయ భూములకు 50 నుండి 100 మీటర్ల పరిధిలో, తాగునీటి వనరులకు వంద మీటర్ల పరిధిలో, 500 జనాభా కలిగిన ప్రాంతానికి వంద మీటర్ల పరిధిలో, 500కుపైబడి జనాభా కలిగిన ప్రాంతాల్లో 300 మీటర్లు పరిధిలో బ్రాకిష్ ఆక్వా సాగు నిషేధమన్నారు. 2026 జూన్ నాటికి అన్ని ఫార్మ్స్ సిఎఎ పరిధిలో నమోదు కావాలని, లేకపోతే చర్యలుంటాయని హెచ్చరించారు. సిఎఎ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మత్స్య శాఖాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవసరమైన పత్రాల గురించి వివరించారు. సమావేశంలో జిల్లా మత్స్య శాఖాధికారి పి.సురేష్, ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, ఫిషరీస్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్ఎన్.రాజు, ఎం.ప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పోలవరం' భూసేకరణలో
అవినీతి పరాకాష్ట..!

- గిరిజనుల భూములపై అడ్డగోలుగా తీర్పులు
- హైకోర్టు ఆర్డర్‌ను పక్కన పెట్టి మరీ ముందుకు
- గిరిజనేతర భూస్వాములుకు మేలు చేయడమే లక్ష్యం
- 60 మందికిపైగా దళారులతో కుమ్మక్కై అధికారుల వ్యవహారం
- 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నట్లు చర్చ
- భూసేకరణ అవినీతిపై జనసేన నేత కరాటం రాంబాబు వ్యాఖ్యలే సాక్ష్యం

'బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో సర్వే నెంబర్ 288లో ఉన్న 24 ఎకరాలను ఎల్‌టిఆర్ భూములుగా నిర్ధారిస్తూ 2018లో హైకోర్టు ఆర్డర్ జారీ చేసింది. హైకోర్టు ఆర్డర్‌ను ఏమాత్రం పట్టించుకోకుండా ఆ భూమికి సంబంధించి ఐటిడిఎ అధికారులు క్లియరెన్స్ ఇచ్చేసిన పరిస్థితి ఉంది. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున సొమ్ము చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి'.

'రెడ్డిగణపవరం గ్రామసభలో సర్వే నెంబర్ ఒకటి, 344-1ఎ, 198-1, 190-2ఎతోపాటు పలు భూములకు సంబంధించి అభ్యంతరాలు తెలియజేస్తూ గ్రామసభ తీర్మానించింది. గ్రామసభ తీర్మానాన్ని పట్టించుకోకుండా అధికారులు నోటిఫికేషన్లు ఇచ్చేసి ముందుకు సాగుతున్న పరిస్థితి ఉంది'.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఉదంతాలు మచ్చుకు మాత్రమే. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం చేపట్టిన భూసేకరణలో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో అవినీతి తారాస్థాయికి చేరింది. పోలవరం నియోజకవర్గంలో జనసేన ఎంఎల్‌ఎ ఉన్నప్పటికీ, ఆ పార్టీ కీలకనేత కరాటం రాంబాబు శుక్రవారం మీడియా ముఖంగా చేసిన వ్యాఖ్యలు అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. రెవెన్యూ, ఐటిడిఎ అధికారుల అవినీతి వ్యవహారంపై అక్కడి ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్న పరిస్థితి ఉంది. గిరిజనుల భూములను గిరిజనేతరులకు కట్టబెట్టేందుకు సాగుతున్న గూడుపుఠాణి చూసి అంతా ఘొల్లుమంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విఆర్‌పురం, కూనవరం మండలాల్లోని 35 గ్రామాల ప్రజలను తరలించేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలో 7,100 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 6,700 ఎకరాలు భూమికి భూమి కింద, మరో 400 ఎకరాలు కాలనీల నిర్మాణానికి అవసరమని అధికారులు తేల్చారు. గిరిజనులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న భూములను గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టి లబ్ధి చేకూర్చేవిధంగా రాజకీయ దళారులతో చేతులు కలిపి అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం భూసేకరణలో ఎకరాకు రూ.15 లక్షలు చొప్పున ఇస్తోంది. దీనిలో 20 శాతం అంటే దాదాపు రూ.మూడు లక్షలు కమీషన్ల కింద తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముందుగానే అందుకు సంబంధించిన చెక్కులపై సంతకాలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే రూ.వందల కోట్లలో అవినీతి జరుగుతున్నట్లు అంతా చెబుతున్నారు. రెడ్డిగణపవరంతోపాటు అనేక గ్రామాల్లో గిరిజనులు అధికారుల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా అడ్డగోలుగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. గ్రామసభల తీర్మానాలకు సంబంధించి సైతం అడ్డదారుల్లో సాగుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణకు సంబంధించి 60 నుంచి 80 మంది వరకూ దళారులు ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది.



ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

పోలవరం భూసేకరణలో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గిరిజనులు చెబుతున్నారు. అవినీతి వ్యవహారంలో కిందినుంచి పైస్థాయి అధికారుల వరకూ వాటాలు ఉన్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే నాలుగు వేల ఎకరాలకు సంబంధించి వ్యవహారం సాగినట్లు తెలుస్తోంది. అధికారపార్టీకి చెందిన నేతలే దళారులుగా మారి ఈ వ్యవహారం నడుపుతున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై జనాల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణలో అవినీతిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

అవినీతిపై కుండబద్దలు కొట్టిన జనసేన నేత

పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో అవినీతి వ్యవహారంపై జనసేన కీలక నేత కరాటం రాంబాబు మీడియా ముందు కుండబద్దలు కొట్టారు. పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, ఇన్‌ఛార్జి మంత్రి కూడా పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకోవాలని కోరారు. దాదాపు 80 మంది దళారులు అధికారులతో కుమ్మక్కై 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపణలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుంటుందో, లేదో వేచిచూడాలి.

రవికుమార్‌కు ఎడ్యు ఐకాన్ అవార్డు




అవార్డుతో రవికుమార్

ఆచంట : కొడమంచిలి గ్రామానికి చెందిన హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ కుక్కల రవికుమార్‌కు ఎడ్యు ఐకాన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా విశాఖపట్నంకు చెందిన మల్ల బ్యూరో ఆఫ్ చైల్డ్ డెవలప్మెంట్ నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ భరత్ కుమార్ చేతుల మీదుగా రవికుమార్‌కు ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈయన విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న సందర్భంగా ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా హెూలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రిన్సిపల్ కృష్ణవేణి, ఉపాధ్యాయులు, సిబ్బందితో పాటు ప్రయివేట్ స్కూల్ కరస్పాండెంట్‌లు రవికుమార్‌ని అభినందించారు.

కలకలం.. కలవరం..!

ప్రకృతి ప్రకోపం.. రోడ్ల దుస్థితి రెండు జిల్లాల ప్రజల్లో కలకలం సృష్టించగా, భీమవరం డిఎస్‌పి వ్యవహారం కూటమిలో కలవరం సృష్టించింది.

ప్రస్తుతం జిల్లా మొంథా తుపాన్ పడగ నీడలో ఉంది. రానున్న నాలుగు రోజులు పరిస్థితి భయానకంగా ఉంటుందనే హెచ్చరికలతో సామాన్య ప్రజానీకంతోపాటు వరి, ఆక్వా రైతుల్లో తీవ్ర గుబులు రేపుతోంది. ఎందుకంటే ఇప్పటికే నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటపొలాల్లోకి నీళ్లు చేరాయి. పంట, మురుగు కాల్వలు నిండుకుండల్లా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో పొలాల్లో నీరు తగ్గకుండానే మరోసారి తుపాన్ ముప్పు ముంచుకురావడంతో వరి పంట చేతికొచ్చేనా అనే ఆందోళన నెలకొంది. ఎందుకంటే ఈనిక దశలో ఉన్న పొలాలు ఈదురుగాలులకు కచ్చితంగా నేలనంటే ప్రమాదం ఉంది. వాటిని మాసూళ్లు చేయాలన్నా అదనపు ఖర్చు తప్పనిసరి. ఈ దశలో నేలనంటడంతో దిగుబడి గణనీయంగా తగ్గడంతోపాటు నాణ్యత లేదనే పేరుతో ధర తగ్గించే ప్రమాదం ఉంది. ప్రకృతి ప్రకోపానికి పంట చివరి దశలో కోల్పోయే ప్రమాదం ఉందని వరి రైతులు వాపోతున్నారు. ఇక ఆక్వా రైతుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అనే చందంగా తయారైంది. ఓపక్క వైరస్‌ల దాడితో సతమవుతూ, మరోపక్క ట్రంప్ సుంకాల ప్రభావంతో విలవిల్లాడుతుండగా విడవకుండా కురుస్తున్న వర్షాలతో ఆక్సిజన్ అందక రొయ్యలు, చేపలు తేలిపోతున్నాయని ఆక్వా రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో మొంథా తుపాన్ ఎటువంటి ప్రభావం చూపుతుందోనని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇక ఇప్పటికే అధ్వానంగా ఉన్న రోడ్లు ఈ వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. దీంతో ఇంటి గడప దాటి రోడ్డెక్కాలంటే జనం బెంబేలెత్తుతున్నారు. రోడ్డెక్కితే గుంతలే కన్పిస్తుండటంతో రోడ్డెక్కడుందో వెతుక్కుంటూ రాకపోకలు సాగించాల్సి వస్తుందంటే అతిశయోక్తి కాదు. మొత్తంగా వరుస వర్షాలు రెండు జిల్లాల్లోని అన్ని తరగతుల ప్రజల్లో కలకలం సృష్టిస్తున్నాయి.



ఇక భీమవరం డిఎస్‌పి జయసూర్య వ్యవహారం కూటమిలో నివురుగప్పిన నిప్పులా తయారైంది. ఒక డిఎస్‌పి స్థాయి అధికారి గురించి నేరుగా డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ జోక్యం చేసుకోవడమే పెద్ద చర్చనీయాంశమవ్వగా, ఆ అధికారి మంచోడంటూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడటం, దానిపై జనసేన శ్రేణులు భగ్గుమనడం చకచకా సాగిపోయాయి. దీంతో తనకు తెలిసిన సమాచారం మేరకే మాట్లాడానని, పవన్ కళ్యాణ్‌కు తెలిసిన సమాచారమే నిజమైనా కావొచ్చు అని డిప్యూటీ స్పీకర్ నష్ట నివారణకు యత్నించినా కూటమిలో భీమవరం ప్రాంతంలో జనసేన, టిడిపి మధ్య నెలకొన్న విబేధాలను ఈ చర్చ ప్రతిబింబిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. సిఎం చంద్రబాబు విదేశాల నుంచి వచ్చాక డిఎస్‌పిపై చర్యలుంటాయా లేక సర్దిచెప్పి టీ కప్పులో తుపాన్‌లా చల్లార్చుతారో వేచి చూడాలి. ఏదేమైనా ఇరువురు కీలకమైన నేతలు రెండు జిల్లాల్లో అత్యంత ముఖ్యమైన పోలవరం నిర్వాసితులు, భూసేకరణలో అక్రమాలు, రోడ్ల దుస్థితి, ట్రంప్ సుంకాలతో ఆక్వా రైతులు పడుతున్న కష్టాలు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి దృష్టి సారించకుండా ఒక అధికారి చుట్టూ కేంద్రీకరించడం ఏమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాల్లో ముఖ్యమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే జనానికి ఉపయోగకరమని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా డిఎస్‌పి వ్యవహారంపై సాగిన చర్చ కూటమిలో కలవరం సృష్టించిందనే చెప్పొచ్చు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్



కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అంగన్వాడీలు

అనారోగ్యంతో అంగన్వాడీ కార్యకర్త మృతి

పని భారమే కారణమంటున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని చెరుకువాడ గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న విజయ(47) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. మండలంలోని పలువురు అంగన్వాడీలు ఆమె మృతదేహానికి నివాళులర్పించి మాట్లాడుతూ పని భారం, తీవ్ర ఒత్తిడి అంగన్వాడీ కార్యకర్త విజయ మృతికి కారణమని తోటి అంగన్వాడీలు ఆరోపిస్తున్నారు. గత కొంతకాలంగా వివిధ యాప్‌ల పేరిట, కార్యక్రమాల పేరిట అంగన్వాడీలపై ప్రభుత్వం పని భారాన్ని పెంచేసిందని, దీనివల్ల విజయ అనారోగ్యంగా ఉన్నప్పటికీ ఆసుపత్రికి వెళ్లే సమయం లేక ఆరోగ్యంపై శ్రద్ధ చూపించలేకపోయిందని, దీనివల్ల కామెర్లు ముదిరి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా మృతిచెందారని వాపోయారు. విజయకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. విజయ మృతి పట్ల ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం, సూపర్‌వైజర్ బాల కుమారి, ఉండి పిహెచ్‌సి సిబ్బంది సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు.

మాతృ, శిశు మరణాలు సంభవిస్తే చర్యలు

సబ్ కమిటీ అంతర్గత సమీక్షలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గీతాభాయ్



మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ గీతాభాయ్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో మాతృ శిశుమరణాలు సంభవిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.గీతాభాయ్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గీతాభాయ్ అధ్యక్షతన మాతృ శిశు మరణాలు సబ్ కమిటీ అంతర్గత సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ త్రైమాసికంలో జరిగిన శిశు మరణాల కారణాలపై సంబంధిత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలతో చర్చించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధా లక్ష్మీ, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సూర్యనారాయణ, గర్భకోశ వ్యాధుల నిపుణులు మాధవి కళ్యాణి, చిన్న పిల్లల వ్యాధి నిపుణులు ప్రవీణ్, మహిళా శిశుసంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలక్ష్మీ, మత్తు వైద్యులు స్వర్ణ లత, జి.పద్మ, డిపిహెచ్ఎన్ వెంకటరత్నం పాల్గొన్నారు.

పాలస్తీనాకు భారత్ సహాయం చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

తణుకు : పాలస్తీనాని దేశంగా గుర్తించి, అన్ని రకాల సహాయం భారత్ నుండి అందించాలని సిపిఎం ఆధ్వర్యాన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. శనివారం స్థానిక అమరవీరుల భవనంలో పాలస్తీనా దేశంపై ఇజ్రాయేల్ చేస్తున్న అక్రమ యుద్ధాన్ని నిలుపుదల చేసి, గాజాలో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. గాజాలో శాంతి కొనసాగాలని, గాజా ప్రజలకు భారత్ అన్ని రకాలుగా సహాయం చేయాలని, అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి దారిదీపం సంపాదకులు డివివిఎస్.వర్మ అధ్యక్షులుగా వ్యవహరించారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు, కాంగ్రెస్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి డి.రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ.. అమెరికా అండదండలతో ఇజ్రాయేల్ పాలస్తీనాలో జ్యాతి హననం చేపడుతుందన్నారు. పాలస్తీనా ప్రజల పక్షాన గతం నుండి భారత్ నిలబడేదని, కాని నేడు లేకపోవడం చారిత్రక తప్పిదం అన్నారు. భారత్‌లో ఉన్న ప్రజలు కూడా ఇజ్రాయేలు చేస్తున్న దాడిని ఖండించాలని విజ్ఞప్తి చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పౌర హక్కుల నాయకులు కౌరు వెంకటేశ్వర్లు, సిపిఎం పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి, బంగారమ్మ, నాగరత్నం, టి.వెంకటేశ్వరావు, అంబటిరామకృష్ణ, పి.రామకృష్ణరాజు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

యువత, విద్యార్థుల బాధ్యత ఎక్సైజ్ అధికారులదే

జిల్లాలో గంజాయిపై ముమ్మర తనిఖీలు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో గంజాయి మాట వినపడకుండా ఉక్కుపాదం మోపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. యువత, విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా చూసే ప్రధాన బాధ్యతను ఎక్సైజ్ అధికారులదేనని స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్లో శనివారం సురక్ష యాప్ వినియోగం, ప్లాస్టిక్ నిషేధం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల తనిఖీలు, ఎక్సైజ్ శాఖ ప్రగతి తదితర అంశాలపై ఎక్సైజ్ అధికారులతో సమీక్షించారు. కల్తీ అక్రమ మద్యాన్ని పూర్తిగా నిరోధించేందుకు ప్రభుత్వం వినియోగదారులకు సురక్ష యాప్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, వినియోగదారులు సురక్ష యాప్ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి, తదితర మత్తు పదార్థాలపై విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, కళాశాలలో ప్రిన్సిపల్స్, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను తరచూ కలిసి వివరాలను తెలుసుకోవాలన్నారు. ఎవరైనా విద్యార్థి డల్గా ఉంటున్నాడా, తరచూ తరగతులకు గైర్హాజరవుతున్నాడా, ప్రవర్తనలో ఏమైనా తేడాలు ఉన్నాయా, వారు దృష్టి ఏమైనా మత్తు పదార్థాల వినియోగం సమాచారం వచ్చిందా వంటి విషయాలను కూలంకషంగా తెలుసుకోవాలన్నారు. మద్యం షాపు, బార్ల వద్ద ప్లాస్టిక్ నిషేధం అమలు జరిగేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు 442 అక్రమ మద్యం కేసులను నమోదు చేసి 442 మందిని అరెస్టు చేయడం జరిగిందన్నారు. వీరి వద్ద 616.39 లీటర్ల మద్యాన్ని, 13 లీటర్ల బీరును స్వాధీనం చేసుకుని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ఏలూరు జిల్లా ఎక్సైజ్ సహాయ కమిషనర్, ఇన్ఛార్జి జిల్లా మద్య నిషేధ అధికారి కెవిఎన్.ప్రభుకుమార్ మాట్లాడారు. అనంతరం సురక్ష యాప్ బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సహాయ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్వి.ప్రసాద్ రెడ్డి, ఎన్ఫోర్స్మెంట్ సిఐ కళ్యాణ్ చక్రవర్తి, ఎస్హెచ్ఒలు కె.బలరామరాజు, ఎం.శ్రీనివాసరావు, స్వరాజ్యలక్ష్మి, ఎస్.రాంబాబు, మణికంఠ రెడ్డి, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మలుపు వద్ద నిలిచిన ట్రాఫిక్

ప్రమాదకరంగా మలుపు..!

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని కొప్పర్రు గ్రామంలోని హైస్కూల్ దగ్గర చెరువు సమీపంలో ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. గతంలో నిర్మించిన కల్వర్టుకు రైలింగ్ లేకపోవడం వల్ల వాహనదారులు అనేక సందర్భాల్లో చెరువులో పడిపోతున్నారు. నరసాపురం నుండి భీమవరం నిత్యం వందలాది వాహనాలు ఈ రోడ్డుపైనే వెళుతూ ఉంటాయి. తుందుర్రులో గల ఆక్వా ఫ్యాక్టరీ నుండి భారీ కంటైనర్లు ఈ మలుపు దగ్గర తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ ప్రాంతంలో ఉన్న ఆక్రమణలు తొలగించటంతో పాటు, కల్వర్టును పునర్ నిర్మించి రైలింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. అధిక వర్షాలు వచ్చినప్పుడు చెరువు నుండి నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్డుపైన ప్రవహించటంతో ఇటుగా వస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వరి, మినుము పంటల పరిశీలన

మల్టి-కె ఎకరానికి కేజీ చొప్పున పిచికారీ చేయాలి : శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


ఒరిగిన వరిచేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఇటీవల కురిసిన అధిక వర్షాల నిమిత్తం మండలంలోని అప్పారావుపేట, పుల్లాయి గూడెం, కడియద్ద, కృష్ణపురం, మోతుగుంట గ్రామాలలోని వరి, మినుము పంటలను ఉండి కెవికె శాస్త్రవేత్తలు, మార్టేరు వరి పరిశోధక శాస్త్రవేత్తలు, స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మినుము పంట అక్కడక్కడ పడిపోవడంతో దాని నివారణకు మల్టి-కె ఎకరానికి ఒక కేజీ చొప్పున పిచికారీ చేయాలని, వరి పంట కోతకు వచ్చే దశలో ఉందని అందుకుగాను చేళ్లలో నుండి నీటిని బయటికి తీసివేస్తే సరిపోతుందన్నారు. ఇంకా వర్షం వస్తే లీటర్కు 50 గ్రాములు ఉప్పు కలిపిన ద్రావణాన్ని స్ప్రే చేసుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో దాల్వా పంటకు పిఆర్ 126 రకానికి ప్రత్యామ్నాయంగా అధిక ఎగుమతికి అనుకూలంగా ఉండే ఎంటియు 1293 సాగు చేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ రకం సుమారుగా 60 బస్తాలు దిగుబడి ఇస్తుందని, రైతులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అలాగే సన్న రకాలైన ఎంటియు 1282, ఎంటియు 1426 దాల్వాకు అనుకూలమని శాస్త్రవేత్తలు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉండి కెవికె మార్టేరు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ మల్లికార్జున రావు, డాక్టర్ గిరిజారాణి, ఎడిఎ ఆర్.గంగాధర్ రావు, మండల వ్యవసాయాధికారి వి.నారాయణరావు, ఎఇఒ డి.విద్యాసాగర్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఫార్మర్ మాస్టర్ శిక్షణ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ విభాగం ఆధ్వర్యాన ఫార్మర్ మాస్టర్ ట్రైనర్స్కు రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ శనివారంతో ముగిసింది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ డిపిఎం డాక్టర్ వై.నూకరాజు ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా అనుసరించడం ద్వారా పంటల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవచ్చన్నారు. నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. రైతులకు బయోకంట్రోల్ పద్ధతులు, జీవామృతం, ఘనజీవామృతం, కీటకనాశక తయారీ విధానాలు వంటి అంశాలపై వివరించారు. ప్రకృతి వ్యవసాయశాఖ అధికారులు, ఎఫ్ఎంటి మాస్టర్ ట్రైనర్స్, సహాయక సిబ్బంది, ఎఫ్ఎంటిలు, శిక్షణా బృంద సభ్యులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

పిహెచ్సి ఆధ్వర్యాన ఎన్సిడి సిడి సర్వే

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని హెల్త్ సెంటర్లలో శనివారం ఎన్సిడి సిడి సర్వే చేసినట్లు డాక్టర్లు పి.కిరణ్మయి ఓంకార్ నాద్ చెప్పారు. సర్వేలో రక్తపోటు, మధుమేహం, బ్రెస్ట్ కేన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్, బిపి, షుగరు వంటి వాటిపై సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది నున్నపాప, పి.దేవి దేవిక, ఎం.యేహన్, జయమ్మ, ఆశాలు పాల్గొన్నారు.

చేనేత మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - పోడూరు

సమాజంలోని పేద వృద్ధులను, కష్టాల్లో ఉన్న అభాగ్యులకు అండగా నిలవడమే రాహుల్ సామాజిక సేవా సంస్థ ఆశయమని ఆ సంస్థ అధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు అన్నారు. రాహుల్ సామాజిక సేవా సంస్థ 19వ వార్షికోత్సవం సందర్భంగా రావిపాడు గ్రామంలో 52 మంది చేనేత పేద మహిళలకు రాహుల్ సామాజిక సేవ సంస్థ ఆధ్వర్యాన చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాహుల్ సామాజిక సేవ సంస్థ వృద్ధాశ్రమం ద్వారా పాలకొల్లు పరిసర ప్రాంతాలకు చెందిన అనేకమంది వృద్ధులకు ఆశ్రయం కల్పించి వారికి ప్రతిరోజు భోజనం, అల్పాహారం, అవసరమైన వారికి వైద్యసేవలు తదితర నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో తమ సేవా సంస్థ ద్వారా మరింత ఉత్సాహంగా, పేద ప్రజలకు, పేద వృద్ధులకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు, 7వ వార్డు మెంబర్ వీరా మల్లికార్జునుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు వాసా జయచంద్రశేఖర్, వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు వడ్డే సంజయ్ కుమార్, సిద్ధాంతి మోక్ష గణపతి, వీర కోటయ్య, జల్లి మురళీకృష్ణ, వాసా మల్లేశ్వరరావు, వాసా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తును సమన్వయంతో ఎదుర్కోవాలి

రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అధికారులు, రైతులు, ప్రజలందరూ కలిసికట్టుగా మొంథా తుపాన్ను సమన్వయంతో ఎదుర్కోవాలని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. శనివారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో అధికారులతో నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధిపై రెవెన్యూ, ఆర్డబ్ల్యుఎస్, ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కోత సమయంలో ప్రకృతి విపత్తులు సంభవిస్తే నష్టాల ఊబిలో కూరుకు పోతారని, తక్షణం పొలంలోని నీటిని బయటికి పంపివేయాలని కోరారు. ప్రస్తుత సమయంలో కురవబోయే వర్షాల వల్ల మరింత నష్టాన్ని కలిగించే విధంగా ఉన్నాయని ప్రభుత్వ నిబంధనలను అధికారులు సమీక్షిస్తూ ఎదుర్కోవాలని అన్నారు. ఈ సమయంలో అధికారులు ఎవరూ సెలవులు లేకుండా నిర్విరామంగా పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు.

నరసాపురం : బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుపాను ప్రభావంతో ఈనెల 27, 28 తేదీల్లో భారీ వర్షాలు, బలమైన గాలులు సంభవించనున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డిఒ దాసిరాజు సూచించారు. పట్టణంలోని రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. అవసరమైతే తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించేందుకు సన్నద్ధం చేస్తున్నామన్నారు. నరసాపురం, పాలకొల్లు పురపాలక సంఘాల్లో డ్రెయిన్లలో పూడిక, అడ్డంకులు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్లను సూచించామన్నారు. గాలులకు రహదారులకు అడ్డుగా చెట్లు కూలితే వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని కూడా రప్పిస్తున్నామని ఆయన తెలిపారు. ఆ రెండు రోజులు ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. సముద్రంలోకి వేటలకు వెళ్లొద్దని ఆయన మత్స్యకారులకు సూచించారు.

ఆచంట : తుఫాన్ ప్రభావం మండలంపై పడనున్న నేపథ్యంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ అన్నారు. జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులతో ఆచంట ఎంపిడిఒ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండొచ్చన్న సమాచారం మేరకు కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గ్రామాల్లో తాగునీరు సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న గృహాలలో నివసించే వారిని రెవెన్యూ శాఖ సహకారంతో సురక్షిత భవనాలలోకి తరలించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహించకూడదని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. పునరావాస కేంద్రాల వద్ద తాగునీరు, పారిశుద్ధ్యం చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్డి కె.బలుసురాజు, కార్యదర్శులు నాగబాబు, దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, హనుమంతరావు పాల్గొన్నారు.


పాలకొల్లు : రాబోయే 4 రోజుల్లో తేలికపాటి నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాలకొల్లు తహశీల్దార్ యద్ల దుర్గా కిషోర్ తెలిపారు. ప్రజలు వరద సహాయక కేంద్రాలకు వెళ్లేలా సిద్ధంగా ఉండాలని కోరారు. ఏదైనా సహాయం కావాలంటే తమను సంప్రదించాలన్నారు.

రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ నేడు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - నరసాపురం

రైతులకు మార్కెట్ యార్డు నుంచి మెరుగైన సేవలందించాలన్నదే పాలకవర్గం లక్ష్యమని నరసాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్గా నియమితులైన జక్కం శ్రీమన్నారాయణ తెలిపారు. ఈనెల 26వ తేదీ ఆదివారం ఎఎంసి ఛైర్మన్గా ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీమన్నారాయణ శనివారం ప్రజాశక్తితో మాట్లాడారు. నరసాపురం పట్టణంలోని అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయన తెలిపారు. ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమాన్ని కూటమి నాయకులు విజయవంతం చేయాలని కోరారు. త్వరలో ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొచ్చి పుంత రహదార్ల అభివృద్ధికి పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో తనకు అప్పగించిన మార్కెట్ కమిటీ బాధ్యతలు మరింతగా కృషిచేసి పూర్వపు వైభవం తీసుకువస్తానన్నారు. గతంకంటే మార్కెట్ యార్డ్ను మరింత అభివృద్ధి పథంలో తీసుకుని వెళ్తానని తెలిపారు. పల్లంగా ఉన్న మార్కెట్ యార్డును మెరకచేయడం, ప్రాంగణం చుట్టూ కొత్తగా ప్రహరీ నిర్మించేందుకు, ఎఎంసి కార్యాలయంలో మౌలిక సదుపాయాలతో పాటు తాగునీటి సదుపాయం కల్పిస్తానన్నారు. ఎఎంసి ప్రాంగణం అభివృద్ధితో పాటు గ్రామాల్లో పుంత రోడ్లను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ త్వరలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఎల్ఎ నాయకర్ను పాలకవర్గ సభ్యులతో కలిసి కోరతానన్నారు. పాలకవర్గ సభ్యులతో కలిసి అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.


ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ

హాజరుకానున్న మంత్రులు, ఎంఎల్ఎలు

ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, మార్కెటింగ్ శాఖ మంత్రి కింజరపు అచ్చె నాయుడు, జిల్లా ఇన్ఛార్జి మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మైనార్టీ వ్యవహారాల సలహాదారులు ఎంఎ షరీఫ్, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఎంఎల్ఎలు బొమ్మిడి నాయకర్, పితాని సత్యనారాయణ, బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, వి.ధర్మరాజు, టిడిపి నియోజకవర్గ ఇన్ఛార్జి పొత్తూరి రామరాజు, ఎంఎల్సి పేరాబత్తుల రాజశేఖర్, రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ, మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, వంగవీటి రాధ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి చిన్న, పలు కార్పొరేషన్ ఛైర్మన్లు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

వాండ్రం-ఎన్ఆర్పి అగ్రహారం పంట బోదె ప్రక్షాళన

ప్రజాశక్తి - ఉండి

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఎన్ఆర్పి అగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలో గల భారత ఆహార సంస్థ గొడౌన్ల వద్ద వర్షపు నీరు భారీగా చేరుకోవడంతో అధికారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఎఫ్సిఐ అధికారులు సంబంధిత పంచాయతీ అధికారులకు తెలియజేయగా వారు విషయాన్ని డిప్యూటీ స్పీకర్కు తెలియజేశారు. డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆదేశాలనుసారం ఎన్ఆర్పి అగ్రహారం గ్రామ సర్పంచి సురవరపు కనకదుర్గ వెంకటాచార్యులు, వాండ్రం గ్రామ సర్పంచి దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు జెవిటి నాయుడు, ప్రవీణ్ కుమార్ తదితరులు ఎఫ్సిఐ గొడౌన్ వద్ద నుండి రోడ్డు వెంబడి ఆక్రమణలు రెండు జెసిబిల సహాయంతో తొలగిస్తూ వర్షపు నీటిని బయటకు పంపిస్తున్నారు. వబిలిశెట్టి ఐస్ ఫ్యాక్టరీ వారు నిర్మించిన కల్వర్టు వద్ద వర్షపు నీరు నిలిచిపోగా ఐస్ ఫ్యాక్టరీ యజమాని వబిలిశెట్టి వెంకటేశ్వరరావు స్వచ్ఛందంగా అక్కడి పనులను తన సొంత ఖర్చులతో పూర్తి చేసి అధికారులకు సహకరించడం అభినందనీయమని, అదేవిధంగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అధికారులకు సహకరించాలని, లేనిపక్షంలో అధికారులు ఆక్రమణలను తొలగించి వర్షపు నీరు వెళ్లే విధంగా చర్యలు చేపడతారని ఎన్ఆర్పి అగ్రహారం గ్రామ పంచాయతీ కార్యదర్శి జెవిటి నాయుడు, వాండ్రం పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎఫ్సిఐ గొడౌన్ నుండి వబిలిశెట్టి ఐస్ ఫ్యాక్టరీ, సంత్ నిరంకారి సత్సంగ భవనం వరకు పంట బోదెను ప్రక్షాళన చేయడంతో వర్షపు నీటి ప్రవాహం ముందుకు సాగిందని, అవసరమైతే కోట్ల ఫంక్షన్ హాల్ పార్కింగ్ వద్ద చేసిన ఆక్రమణను, రామచంద్ర ఫుడ్ కోర్ట్ వద్ద ఉన్న ఆక్రమణలను తొలగించి వాండ్రం పంట కాలువలోకి వర్షపు నీరు వెళ్లే విధంగా నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది చిట్టూరి ఏసురత్నం, వబిలిశెట్టి ఐస్ ఫ్యాక్టరీ యజమాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


పంట బోదెను ప్రక్షాళన చేయిస్తున్న అధికారులు

28న వైసిపి ఆధ్వర్యాన ర్యాలీ

ప్రజాశక్తి - పోడూరు

ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో మెడికల్ విద్యను ప్రయివేటీకరణ వైపు నడుపుతోందని, దీనివల్ల వైద్యం పేదలకు దూరమయ్యే ప్రమాదం ఉందని మండల జెడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు అన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యాన చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా నియోజకవర్గ కేంద్రం ఆచంటలో ఈనెల 28వ తేదీన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీ పోస్టర్లను తూర్పుపాలెంలోని పార్టీ కార్యాలయంలో శనివారం వైసిపి నాయకులు ఆవిష్కరించారు. ఈ జెడ్పిటిసి గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ ఈ అన్యాయ విధానాలను వ్యతిరేకంగా ప్రజలందరూ సంఘటితంగా నిలబడి, మాజీ మంత్రి, వైసిపి నేత చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యాన నియోజకవర్గ కేంద్రమైన ఆచంటలో జరగబోయే భారీ ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేత వైఎస్.జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 10 నుండి నవంబర్ 22 వరకు నియోజకవర్గంలో 60 వేల సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు ఖండవల్లి వాసు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల కన్వీనర్ పిల్లి నాగన్న, గూడూరి దేవేంద్రుడు, జక్కంశెట్టి చంటి, నల్లిమిల్లి బాబిరెడ్డి, గుబ్బల వీర్రాజు, కర్రి వేణుబాబు, సుంకర సీతారాం, పోతుమూడి రామచంద్రరావు, కోట వెంకటేశ్వరరావు, మానేపల్లి సుబ్బారావు, పిల్లి రుద్రప్రసాద్, దంపన బోయిన బాబూరావు పాల్గొన్నారు.

ఎక్సైజ్ సురక్ష యాప్ కరపత్రాల విడుదల

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వినియోగదారుడే నేరుగా మద్యం నాణ్యత పరిశీలించుకునే విధంగా ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ను ఉపయోగించే విధానాన్ని మద్యం దుకాణాల వద్ద ప్రజా ప్రకటన పేరిట కరపత్రాలను తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ ఇ.స్వరాజ్యలక్ష్మి విడుదల చేశారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా యాప్ను డౌన్ లోడ్ చేసుకొనే విధానంతో పాటు వినియోగదారుడు స్కాన్ చేసుకోవాలి, వారు కొనుగోలు చేసిన మద్యం అసలుదేనా లేక నకిలీదా అనే విషయాన్ని తెలుసుకోవచ్చన్నారు. ప్రతి మద్యం షాప్ వద్ద కరపత్రాలను పంపిణీ చేసి వినియోగదారులకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అవగాహన కలుగ చేస్తున్నారని ఆమె ఈ శనివారం ప్రకటనలో తెలియ జేశారు. ఈ యాప్ వినియోగంలో ఏమైనా సందేహాలు ఉంటే నేరుగా స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో సంప్రదించ వచ్చునని లేదా 9440902433 నెంబర్ను సంప్రదించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఆర్.దొరబాబు, మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.


యాప్ను విడుదల చేస్తున్న ఎక్సైజ్ అధికారులు


సత్తిబాబు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

మాజీ ఎంపిటిసి సత్తిబాబుకు మాతృవియోగం

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని ఏ నుగువానిలంక మాజీ ఎంపిటిసి నారిన వెంకట సత్యనారాయణ(సత్తిబాబు) మాతృమూర్తి సత్యవతి(80) ఇటీవల వృద్ధాప్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో శనివారం సత్తిబాబుతో పాటు వారి సోదరులు రాంబాబు, జోగిబాబులను సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, సిపిఎం సీనియర్ నేత మాసవరపు సుబ్బారావు, గ్రామ సర్పంచి ఈద ప్రమీల సువర్ణ రాజు, యలమంచిలి సొసైటీ అధ్యక్షులు బొప్పన హరి కిషోర్(చిన్న), సిపిఎం నాయకులు తెన్నేటి స్టాలిన్, పల్లేరు వెంకట స్వామి పరామర్శించారు.

బొబ్బిలి వంతెన పరిశీలన

ప్రజాశక్తి - గణపవరం


పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

శిథిలావస్తకు చేరిన గణపవరం-బొబ్బిలి వంతెనను ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ మరమ్మతుల పనులకు సంబంధించి తీసుకోవలసిన చర్యలపై మాట్లాడారు. వంతెన పుట్పాత్ రైలింగ్ స్లాబ్ను పరిశీలించారు. వంతెన శిథిలావస్తకు చేరటం వల్ల వెంటనే మరమ్మతు పనులు సకాలంలో పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. వంతెనపై నుండి ఏలూరు, నారాయణపురం, ద్వారకాతిరుమల, చింతలపూడి వెళ్లడానికి ఉపయోగపడే పనులను చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు

ప్రజాశక్తి - నరసాపురం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు

విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కాకుండా బంగారు భవిష్యత్ను నాశనం చేసుకొవద్దని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు సూచించారు. శనివారం మండలంలోని స్వర్ణాంధ్ర కాలేజీలో మండల న్యాయ సమితి ఆధ్వర్యాన డ్రగ్స్, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థి దశలో ఒకసారి డ్రగ్ కేసులో గానీ, ర్యాగింగ్ కేసులో గానీ రిజిస్టర్ అయితే ప్రభుత్వ ఉద్యోగానికి, విదేశీ విద్యకు అనర్హులవుతారన్నారు. విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి కలలు కని, వాటిని సాకారం చేసుకొనేందుకు పట్టుదలతో కృషి చేసినట్లయితే తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు, ప్రఖ్యాతలు తెచ్చిన వారవుతారన్నారు. సెలవు దినాల్లో తల్లిదండ్రులకు సహాయకారులుగా ఉండాలి గానీ చెడు సావాసాలకు, చెడు అలవాట్లకు కేటాయించకూడదన్నారు. నేడు సోషల్ మీడియా ప్రభావం వల్ల చాలా మంది విద్యార్థులు సైబర్ నేరాలకు గురై మానసిక ఒత్తిళ్లకు, బలవన్మరణాలకు పాల్పడుతున్నారని, డ్రగ్ వాడకం చిన్నగా మొదలై ప్రాణాలు తీసుకొనే స్థాయికి దారి తీస్తుందన్నారు. సొసైటీలో గుర్తింపును కోల్పోతారని కాబట్టి పెద్దలు, గురువులు చెప్పిన మాటలు వినాలన్నారు. ట్రిబుల్ డ్రైవింగ్ కూడా మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, డైరెక్టర్ ఎ.శ్రీహరి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గోపీచంద్, బార్ అసోసియేషన్ కార్యదర్శి వి.సూర్య ప్రకాశరావు, న్యాయవాదులు దానయ్యనాయుడు, ఫణికర్, వెంకటేశ్వరరావు, సిఐ దుర్గా ప్రసాద్, మొగల్తూరు ఎస్ఐ నాగలక్ష్మి పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం సందర్శన

ప్రజాశక్తి - నరసాపురం

ఉన్నత న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఉన్న మిషన్ ఆఫ్ హోప్ బాలుర వసతి గృహాన్ని నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు, వంటగది, బాలురు నిద్రిస్తున్న గదులను పరిశీలించారు. హాస్టల్ బాలురను, ఆహార పదార్థాలు, ఆరోగ్యం, యాజమాన్యం అందిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ జి.దుర్గాప్రసాద్, న్యాయవాదులు సూర్య ప్రకాశరావు, దానయ్య నాయుడు, ఫణికర్, ఎస్ఐ నాగలక్ష్మి, కోర్టు లైజన్ సూర్య భాస్కరరావు పాల్గొన్నారు.

వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షులుగా సుబ్బారావు

ప్రజాశక్తి - ఆచంట

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని జిల్లా పరిషత్ ప్రతిపక్ష నేత గుంటూరు పెద్దిరాజు అన్నారు. వైసిపి రైతు విభాగం మండల అధ్యక్షులుగా కొడమంచిలి గ్రామానికి చెందిన మన్నె సుబ్బారావును నియమించారు. శనివారం తూర్పుపాలెం వైసిపి కార్యాలయంలో ఆయనకు పూలదండలు వేసి అభినందనలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో గుంటూరి పెద్దిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యాన మన్నె సుబ్బారావును ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన అభినందించారు. గ్రామ స్థాయిలో వైసిపి బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ జక్కంశెట్టి చంటి, వైసిపి సీనియర్ నాయకులు కర్రి వేణుబాబు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు, ముత్యాల నాగేశ్వరరావు, కీర్తి తాతాజీ, పోతుమూడి రామచంద్రరావు, కేశవరపు గణపతి పాల్గొన్నారు.

ఛాంబర్స్లో ఉచిత రక్త గ్రూపు నిర్ధారణ పరీక్షలు

పాలకొల్లు : స్థానిక బిఆర్ఆర్ అండ్ జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం ఛాంబర్స్ కళాశాల, ది వాలంటరీ బ్లడ్ బ్యాంక్, పాలకొల్లు వారి సంయుక్త సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత రక్త గ్రూప్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు తెలిపారు. సృష్టిలో కృత్రిమంగా తయారు చేయలేనిది రక్తమని, అత్యవసర పరిస్థితుల్లో రక్తం దానం చేయడానికైనా, తీసుకోడానికైనా వ్యక్తుల రక్తం గ్రూప్ తెలుసుకొనుట అత్యంత ముఖ్యమని, విద్యార్థి దశలోనే తమ రక్తం గ్రూపును తెలుసుకోవలసిన బాధ్యత ఉంటుందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 327 మందికి వారి రక్త గ్రూప్ నిర్ధారణ చేసి వారికి తెలియజేసామన్నారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిందని తెలిపారు.

జనసేనలోకి పలువురు

నరసాపురం : నరసాపురంలోని జనసేన కార్యాలయంలో ఎల్బి చర్ల గ్రామ సర్పంచి గుబ్బల యమున భానుమూర్తి సంగాని వడ్డీకాసులు, బొడ్డు అశోక్ కుమార్, జల్లి సురేష్, వారి అనుచరులతో జనసేనలో చేరారు. జనసేన సిద్ధాంతాలు, పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులై వైసిపిను వీడి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా బొమ్మిడి నాయకర్ వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ జనసేనపై ప్రజల విశ్వాసం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మండల ప్రెసిడెంట్ ఆకన చంద్రశేఖర్, నరసాపురం టౌన్ ప్రెసిడెంట్ కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నీటి సంఘాల ఉప అధ్యక్షులు గుబ్బల మార్రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మత్స్యకార సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంత రావు పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయించాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎన్.శ్రీనివాసరావు కోరారు. ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. ఉపాధ్యాయ శిక్షణార్థులు పరీక్షను రాయవలసి ఉంటుందన్నారు. అయితే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం జూలై 29, 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులు కూడా టెట్ పరీక్షను ఉత్తీర్ణులు కావాలని, లేకపోతే ప్రమోషన్కు, సర్వీసులో కొనసాగేందుకు అర్హులు కాదన్నారు. దీనికోసం సుప్రీంకోర్టు రెండేళ్లు గడువు ఇచ్చిందన్నారు. ఐదేళ్ల కంటే తక్కువ ఉద్యోగ కాలం ఉన్న ఉపాధ్యాయులకు దీని నుండి మినహాయింపు ఇచ్చిందన్నారు. ఈ తీర్పును పున్ణ సమీక్షించాలని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వాలు గానీ, సంస్థలు గాని రివ్యూ పిటిషన్ వేయవలసి ఉందన్నారు.

టెట్పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలి : ఎపిటిఎఫ్

టెట్పై సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఎపిటిఎఫ్(1938) జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు హరికృష్ణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు శ్రీవల్లి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ నోటిఫికేషన్ ఇవ్వడం శోచనీయమని, ఉపాధ్యాయులందరినీ తీవ్రంగా కలచి వేస్తోందన్నారు. వెంటనే సుప్రీంకోర్టులో తెలంగాణ, తమిళనాడు, కేరళ ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేసినట్లుగానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. 20 నుండి 30 ఏళ్లు పైబడి సర్వీస్ పూర్తి చేసిన వారు ఈ వయస్సులో టెట్ ఉత్తీర్ణత విషయంలో ఒత్తిడి గురవుతున్నారని, ఉద్యోగోన్నతులకు కూడా టెట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన సరికాదన్నారు. బిఇడి, డిఇడిలు పూర్తి చేసి డిఎస్సి పరీక్షల ద్వారా ఎంపికైన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు ఇప్పుడు టెట్ ఉత్తీర్ణత సాధించాలనే నిబంధన సరైంది కాదన్నారు. విద్యాహక్కు చట్టం అమల్లోకి రాకముందు నియామకమైన ఉపాధ్యాయులకు టెట్ వర్తింపజేయడం ఎంతవరకు సమంజసం అన్నారు.